# హంసలను వేటాడొద్దు [19]

మూలం: బోరిస్ వాసిల్యేవ్

అనువాదం: కె. సురేష్



**అనువాదం:** హంసలను వేటాడొద్దు [19]

**మూలం:** డోంట్ షూట్ ద వైట్ స్వాన్స్

**మూల రచయిత:** బోరిస్ వాసిల్యెవ్

**అనువాదకుడు:** కె. సురేష్

ప్రచురణ: కినిగె పత్రిక http://patrika.kinige.com

కాలం: ఆగస్టు 2014

శాశ్వత లింకు : http://patrika.kinige.com/?p=3380

©Author.

**What can you do with this document?**

Read it!
Store this PDF on your device.
Share the link with your friends
Share this PDF with your friends via personal communication (e.g. email)
Take printouts for personal use

**What is not allowed by Owner of this document?**
Editing the document. No page to be removed or added.
Distributing to public (instead kindly share the link to Kinige given above)

# హంసలను వేటాడొద్దు [19]

దీని ముందు భాగం

**జరిగిన కథ:** పాటలు పాడుతూ ఆనందంగా గడుపుతూ ఆ రాత్రి అంతా యెగార్ ఇంట్లోనే ఉండిపోతారు. 'కొత్త అటవీ అధికారిగా బాధ్యత అప్పగిస్తే స్వీకరిస్తావా' అని యెగార్ ను యూరీ పెట్రోవిచ్ అడుగుతాడు. యెగార్ ఒప్పుకుంటాడు. మర్నాడు యూరీపెట్రోవిచ్ తో కలిసి యెగార్ తన తోడల్లుడు ఫ్యోడార్ ఇపటొవిచ్ ఇంటికి తనిఖీకి బయల్దేరతాడు. అక్కడ అక్రమంగా ఉన్న పరికరాల్ని స్వాధీనం చేసుకుంటాడు. యూరీపెట్రోవిచ్ విధులను యెగార్ కు అప్పజెప్పి తాను పని మీద పట్టణం వెళతాడు. యెగార్ కొడుకు కోల్కాతో పాటు కొన్ని రోజులు అడవిలోనే మకాం పెట్టి అక్కడంతా బాగు చేయిస్తాడు. తండ్రి ప్రోత్సాహంతో కోల్కా పర్యాటకులకు సూచనలను పాటలు, కవితల రూపంలో రాస్తాడు. యెగార్ పాతసహచరులు ఫిల్, క్రోక్ లు చెట్లు కొడుతూ యెగార్ కు పట్టుబడతారు. యెగార్ ఆపమని ఆదేశిస్తాడు. వాళ్లు యెగార్ ను బెదిరించి గొడ్డళ్లు అక్కడ వదిలేసి వెళ్తారు. **ఇక చదవండి:——**

## 19

జిల్లా కేంద్రానికి వెళ్లి రావాలన్న కోరిక నోనాలో రోజురోజుకీ పెరిగిపోతోంది. పాఠశాలకి పుస్తకాలు, ఇతర సామాగ్రి కొనాలి. మొదట ఆమె తటపటాయించింది కానీ తరువాత ప్రిన్సిపాలు దగ్గరికి వెళ్లి ఆ సంవత్సరం పాఠశాల తెరిచే లోపల తాను జిల్లా కేంద్రానికి తప్పనిసరిగా ఎందుకు వెళ్లి రావాలో సుదీర్ఘవివరణ ఇచ్చింది. అవసరమైనవన్నీ తీసుకురావటానికి ఆమె ఆ రోజే బయలుదేరటానికి సిద్ధంగా ఉంది.

"మనకేం కావాలి?" ప్రిన్సిపాలు ఆశ్చర్యంగా అడిగాడు. "మనకేం అవసరం లేనందుకు సంతోషించాలి."

"ఒక గ్లోబు కావాలి," అంది నోనా యురీవ్నా. "మనకున్న గ్లోబు పనికిరాదు. అంటార్కిటికా ఉండాల్సిన చోట ఒక పెద్ద చిల్లు ఉంది."

“నీ అంటార్కిటికా కోసం నా దగ్గర నిధులేమీ లేవు,” ప్రిన్సిపాలు గొణిగాడు. “గ్లోబుని ఫుట్‌బాల్‌లాగా వాడితే చిల్లులు పడకుండా ఏమవుతుంది? అదీ కాక తాత్వికంగా చిల్లు కూడా ఒక ప్రదేశమే. దాని చుట్టూ భూమి ఉన్న ఒక ప్రదేశం.”

“ఒక ఫుట్‌బాల్ కూడా కొనవచ్చు,” నోనా యురీవ్నా జోరుగా తలూపింది. “ఇంకా ఇతర వస్తువులు కూడా కొనాల్సి ఉంది.”

“సరే,” ప్రిన్సిపాలు అంగీకరించాడు. “ఖర్చు ముప్పై రూబుళ్లకు మించదంటే అనుమతిస్తాను. అయితే ప్రయాణం ఖర్చులన్నీ నువ్వే పెట్టుకోవాలి.”

జిల్లా సమావేశం ఏదో జరుగుతుండటంతో ఒక్క హోటల్లో కూడా ఖాళీ లేదు. అయితే ఈ పరిస్థితికి విచారించాల్సింది పోయి నోనా సంతోషించింది. ఆమె వెంటనే యూరి పెట్రోవిచ్‌కి ఫోన్ చేసి తాను పనిమీద తప్పనిసరిగా రావలసి వచ్చిందని, అయితే హోటళ్లు ఏవీ ఖాళీ లేవని, లోలోపల సంతోషిస్తూ, చెప్పింది.

“నువ్వు పరపతి ఉన్న అధికారివి,” రిసీవర్‌లోకి నవ్వుతూ ఆమె చెప్పింది. “మారుమూల పల్లెనుంచి పనిమీద వచ్చిన ఒక టీచరుకి ఒక గది ఇప్పించగలుగుతావా?”

“తప్పనిసరిగా,” యూరి పెట్రోవిచ్ సంతోషంగా చెప్పాడు. “నువ్వు ఆకలిగా ఉండిఉంటావు. నా గదికి రా, ఏదో ఒక ఏర్పాటు చూద్దాం.”

“లేదు –” నోనా కీచుగా అంది. “అహా, నా ఉద్దేశం ఇది బాగానే ఉంది.”

సరిగ్గా ఆ క్షణంలో నోనా తనలో ఉన్న రెండు పరస్పర విరుద్ధ వ్యక్తిత్వాలను గుర్తించింది. ఒకటి, ఆత్మవిశ్వాసంగల ప్రశాంత మహిళది, ఆమె లేని పని కల్పించుకుని పట్టణం వచ్చి అంత తెలివిగా ఫోనులో మాట్లాడింది. రెండవది, మగవాళ్లంటే, ప్రత్యేకించి యూరి పెట్రోవిచ్ అంటే చచ్చేటంత భయమున్న పిరికి అమ్మాయి. ఆ పిరికి అమ్మాయే “లేదు,” అంటూ కీచుమంది.

యూరి పెట్రోవిచ్ ఇంకేమీ ఆలోచించకుండా ఏమైనా కొనుక్కురావటానికి బయలుదేరాడు. చాలా బన్నులు, మిఠాయిలు, పాలు తీసుకొచ్చాడు. గది శుభ్రం చేసి బల్ల సర్దే సమయానికి నోనా తలుపు కొట్టనే కొట్టింది.

“నన్ను క్షమించాలి. నాకేమైనా ఏర్పాటు చెయ్యగలిగారా, యూరి పెట్రోవిచ్?”

"ఆఁ? ఓ, హోటలు గది గురించా. ఫోను చేసాను. ఒక గంటలో ఏదో ఏర్పాటు చేస్తామన్నారు కానీ ఏమీ హామీ ఇవ్వలేదు. టీ తాగిన తరువాత మళ్లీ ఫోను చేద్దాం."

యూరి పెట్రోవిచ్ ముందుగా ఏమీ ఆలోచించుకోకుండానే అబద్ధం ఆడాడు. సిగ్గరి అయిన ఈ టీచరు అంటే అతడికి ఇష్టం ఏర్పడింది. అతడిది పెద్ద గది, మార్గాంతరం లేక నోనా రేపటిదాకా ఇక్కడే ఉండాలని అతడు లోపల్లోపల కోరుకోసాగాడు. అంతకు మించి ఇంకేమీ లేదు – మిగిలిన ఆలోచనలన్నిటినీ అతడు ఎప్పటికప్పుడు తోసేస్తున్నాడు. అందుకే స్వచ్ఛమైన అంతరాత్మతో నోనాని ఆహ్వానించగలిగాడు.

ఆకలిగా ఉన్న నోనా, అమ్మాయి మాదిరి కాకుండా ఆవురావురుమంటూ తినసాగింది. యూరి పెట్రోవిచ్ మాత్రం తన ఆలోటనలతో సరిపెట్టుకుని ఆమెకు కావలసినవి అందిస్తూ ఉన్నాడు. అతడు ప్రశ్నలు అడుగుతుంటే ఆమె చిన్నపిల్ల మాదిరి నోరు నిండుగా ఉన్నప్పుడే మాట్లాడటం అతడికి నచ్చింది.

"అయితే ఆధునిక మగవాడిలో వినయం అన్నది ఉండవలసిన గుణం అంటావా?"

"తప్పనిసరిగా ఉండాలి."

"కానీ గుడ్డిగా 'అలాగే' అనటం ఒకరిని ప్రశ్నించకుండా దాసోహమనటం కాదా? ఎంతైనా 'తన' అన్నదానిపట్ల ఎరుకతోనే వ్యక్తిత్వం మొదలవుతుంది కదా, నోనా."

"వ్యక్తిత్వం అన్నది దానంతట అదే ఆదర్శం కాదు: హిట్లరుది కూడా ఒక వ్యక్తిత్వమే. మేధో వ్యక్తిత్వం ఆదర్శప్రాయమైనది."

నోనాకి భావోద్వేగాలు ఎక్కువ, అదికూడా యూరి పెట్రోవిచ్‌కి నచ్చింది. అతడు నవ్వుతూ – లోపల్లోపల ఆ నవ్వు వెర్రిగా కనిపించవచ్చన్న అనుమానం ఉన్నప్పటికీ – కూర్చున్నాడు.

"మేధో వ్యక్తిత్వం అంటే బాగా చదువుకుని ఉండటమని నీ ఉద్దేశమా?"

"కాదు. ఒక వ్యక్తిని అంచనా వెయ్యటానికి చదువన్నది పరిమాణాత్మక మూల్యాంకన మాత్రమే, మేధావితనం అన్నది గుణాత్మకమైనది. పరిమాణాత్మకమైనది గుణాత్మకమైనదిగా మార్పు చెందటానికి అవకాశం ఉందనుకోండి. నా ఉద్దేశంలో, ఉదాహరణకు, మూడు డిగ్రీలు ఉన్న వ్యక్తి కంటే యెగార్ పొలుష్కిన్ ఎంతో గొప్ప మేధావి."

"నీ అంచనాల కొలబద్ద చాలా కఠినమైనది."

"కానీ ఖచ్చితమైనది."

"ఇతరులలో ఏ ఇతర గుణాలను నువ్వు ఇష్టపడతావు?"

ఏం చెప్పాలో తెలియక ఒక్కసారిగా "అణకువ" అనేసింది.

ఈ సమాధానం ఆమె అభిప్రాయంకాక త్వరిత స్పందనగా యూరి పెట్రోవిచ్ భావించాడు. అయితే, దాని గురించి చర్చ కొనసాగించలేదు. ఆపాటికి నోనా తెచ్చినవన్నీ తినేసి టీ తాగుతోంది.

"హోటలు గది గురించి ఫోను చెయ్యటం మరిచిపోవు కదా?"

"ఆ, ఆ!" యూరి పెట్రోవిచ్‌కి గుర్తుకొచ్చింది. "తప్పకుండా చేస్తాను..."

అతడు ఫోను దగ్గరకు వెళ్లాడు. నోనా బల్ల శుభ్రం చేస్తుండగా అతడు లేని నంబరుకు డయల్ చేసాడు. అవతలవైపునుంచి ఏవో పిచ్చి శబ్దాలు వస్తుండటంతో ఆమె వింటుందేమోనని యూరి పెట్రోవిచ్ భయపడ్డాడు. అందుకే అవసరమైనదానికంటే పెద్దగా మాట్లాడసాగాడు.

"హలో? శాఖాధిపతికి కలపండి. హలో, ప్యొటార్ ఇవనోవిచ్, నేను చువలోవ్‌ని. అవును, ఇంతకు ముందు నేను చేసాను. ఏమిటి? అలాగంటే ఎలాగండి, ఇవాన్ ప్యోటొవిచ్! అట్లెట్లా? వినండి, ఇది చాలా ముఖ్యం..."

ఇటువంటి విషయాల్లో అనుభవం లేని యూరి పెట్రోవిచ్ అధికారి పేరు తారుమారు చెయ్యటమే కాకుండా, తన మాటల మధ్య వ్యవధి ఇవ్వటం కూడా మరిచిపోయాడు. ఫోనులో అతడు మాట్లాడుతున్నది నోనా వింటూ ఉంటే అతడి నాటకాన్ని వెంటనే పసిగట్టి ఉండేదే. అయితే నోనా తన ఆలోచనలలో మునిగి ఉండటంతో పిచ్చిగా మోగుతున్న రిసీవరులోకి యూరి పెట్రోవిచ్ ఏమి మాట్లాడినా నడిచిపోయింది.

అసలు విషయమేమిటంటే జీవితంలో నోనా ఏ యువకుడికైనా సాయంత్రం అతిథిగా ఉండటం అదే మొదటిసారి.

బన్నులు తింటూ, టీ తాగుతున్నంతసేపు తనలోని మహిళతోపాటు ఉన్న అమ్మాయికి ఇంటిదగ్గరే ఉన్నట్టు అనిపించింది. అయితే టీ తాగిన తరువాత, బయట చీకట్లు ముసురుకుంటూ ఉండటంతో ఆమెలోని అమ్మాయి భయంతో వెనక్కి తగ్గసాగింది. ఈలోగా ఆమెలోని మహిళ స్పష్టంగా ముందుకొస్తోంది: ఇప్పుడు ఆమే యూరి పెట్రోవిచ్ ప్రవర్తనను అంచనా వేస్తోంది, తనను

అతడు ఇష్టపడుతున్నాడని ఆమెకు అర్థమయ్యింది, అతడి గదిలోకి ఆమె రావటం ఎవరూ చూడలేదన్న విషయం ఆమే పదే, పదే గుర్తు చేసుకుంటోంది.

అంతేకాదు, ఈ మహిళే నోనాతో కోపంగా అంటోంది, "ఇప్పుడు పిచ్చిదానిలా వ్యవహరించవద్దు." నోనా ఆ గొంతు అంటే భయపడుతోంది, కానీ అది క్షణక్షణానికి తీవ్రమవుతోంది: "పిచ్చిదానిలా వ్యవహరించవద్దు. ఇందుకోసమే పట్టణం వచ్చావు. ఇప్పుడు మూర్ఖురాలిగా ప్రవర్తించవద్దు, నోనా." ఆ గొంతు అంటే నోనా భయపడుతూ దానితో వాదనకు దిగలేదు.

ఈ కారణంగానే టెలిఫోనుతో యూరి పెట్రోవిచ్ ఆడిన నాటకాన్ని ఆమె గమనించలేదు. అతడు, "నోనా, ఎక్కడా ఖాళీలు లేవంట, ఒక్క హోటలులో కూడా గదులు లేవు."

ఆమెలోని మహిళ అందుకు సంతసించింది, కానీ ఆమెలోని అమ్మాయి భయపడిపోయింది. సంతోషించాలో, భయపడాలో నోనా నిర్ణయించుకోలేకపోతోంది.

"అయ్యో, దేవుడా! నాకు పట్టణంలో ఎవరూ తెలియదే."

"నేను తెలీదా?" యూరి పెట్రోవిచ్ కోపంగా అడిగాడు. తను కావాలని అలా చేసానని నోనా అనుమానిస్తుందేమోనన్నది అతడి భయం. "ఇది పెద్ద గది, చాలా చోటు ఉంది."

"లేదు, లేదు..." అంది నోనా. కానీ ఆ రెండు "లేదు"లు ఒక "సరే"గా వినిపించటంతో యూరి పెట్రోవిచ్ సోఫామీద తనకు పక్క ఏర్పాటు చేసుకోసాగాడు.

నోనా ఉంటోందన్న అంగీకారానికి రావటంతో వాళ్లిద్దరూ ఉన్నట్టుండి మాట్లాడటం మానేసారు, ఒకరి వైపు ఒకరు చూడకుండా ఉండటానికి ప్రయత్నంచసాగారు. నోనాలోని అమ్మాయి భయంతో గడ్డకట్టుకుపోగా, ఆమెలోని మహిళ హుందాగా తన పనులు తాను చేసుకుంటూపోసాగింది.

"నేను స్నానం చేసివస్తే మీకు అభ్యంతరం లేదు కదా?"

"అలాగే, అలాగే, తప్పనిసరిగా." యూరి పెట్రోవిచ్ ఉన్నట్టుండి కంగారు పడసాగాడు. ఎందుకంటే ఆమెలోని మహిళ ఆ ప్రశ్న అడగగా, అతడికి తాను చిన్న పిల్లవాడినన్న భావం కలిగింది. "ఈ రోజు ఉదయమే తువ్వాళ్లు మార్చారు. కాబట్టి..."

"సరే."

అందమైన నైటీ చేతిమీద వేసుకుని ఆమెలోని మహిళ గర్వంగా నడుచుకుంటూ వెళ్లింది. ఆమె గొంతులోని ఆ మార్పునుంచి యూరి పెట్రోవిచ్ తేరుకునేలోగా భయపడుతున్న అమ్మాయి స్నానాలగదిలోంచి తల బయటకుపెట్టి, "తలుపుకి గడియ లేదు!" అంది.

"నాకు తెలుసు, ఆందోళన పడవలసింది ఏమీ లేదు," నవ్వుతూ అన్నాడు యూరి పెట్రోవిచ్, కొంత ఊపిరి పీల్చుకుంటూ.

ఇక్కడొక విషయం చెప్పాలి. ఇటువంటి పరిస్థితుల్లో యూరి పెట్రోవిచ్‌కి ఎదురైన ఆడవాళ్లు నోనా లాగా కాకుండా ఎలా ప్రవర్తించాలో వాళ్లే నిర్ణయించుకునేవాళ్లు, వెర్రివాడిలాగా ప్రవర్తించకుండా ఉండటమే అతడి పని. నోనాలో బయటకు వచ్చిన మహిళ ఆట ఆడుతోంది, ఆ ఆట ఎంతవరకు వెళుతుందో మన అటవీ వార్డెనుకి తెలియటంలేదు. కాబట్టి అంతుపట్టని మహిళ స్థానంలో సుపరిచితమైన గుండ్రటి కళ్ల భయపడే అమ్మాయి కనపడటంతో కొంత ఊపిరి పీల్చుకున్నాడు.

"అరె!" అంది అమ్మాయి, తన నైటీని గట్టిగా పట్టుకుంటూ. "ఈ గదిలో తలుపులు లేవు."

మంచానికీ, సోఫాకి మధ్య తెర మాత్రమే అడ్డంగా ఉంది. ఏం చెయ్యాలో తెలియక నోనా తెర దగ్గర నిలబడి ఉంది.

"అక్కడొక కుర్చీ పెట్టు," యూరి పెట్రోవిచ్ సూచించాడు. "నిద్రలో నేను అటుగా వస్తే కుర్చీకి తగులుకుంటాను. దాంతో శబ్దం అయ్యి నీకు అరవటానికి సమయం ఉంటుంది."

"చాల్లే," నోనాలోని మహిళ చల్లగా బదులిచ్చింది.

యూరి పెట్రోవిచ్ స్నానాలగదిలోకి వెళ్లాడు. నోనా మంచంలో పడుకుని కొంచెం కుదుటపడటానికి సమయం ఉంటుందని అతడు కావాలనే అక్కడ ఎక్కువసేపు గడిపాడు. ఆ తరువాత అతడు లైటు తీసేసి మెల్లగా అడుగులో అడుగు వేసుకుంటూ సోఫాలోకి చేరుకున్నాడు. అందులో కూర్చోగానే ప్రతి స్ప్రింగు కిర్రుమంటూ మోతచేయసాగింది.

"ఛా!" అతడు పైకే అన్నాడు.

"ఇంకా నిద్రపోలేదా?" నోనా మెల్లగా అడిగింది.

"లేదు," చొక్కా విప్పబోతున్నవాడల్లా మళ్లీ వేసుకుంటూ యూరి పెట్రోవిచ్ బదులిచ్చాడు. "ఏం కావాలి, నోనా?"

నోనా ఏమీ మాట్లాడలేదు. అతడి గుండె వేగంగా కొట్టుకోసాగింది.

అతడు మంచం ఉన్న వైపుకి నడిచాడు. ఆ క్రమంలో కుర్చీకి తట్టుకుని పెద్దగా శబ్దం అయ్యింది.

“ఛా!”

నోనా మెల్లగా నవ్వింది.

“కాలికి ఎదురుదెబ్బ తగిలి నేనుంటే నువ్వేమో నవ్వుతున్నావా?”

“పాపం పిల్లవాడు.”

ఆ మసక కాంతిలో ఆమె మంచంలో కూర్చుని ఉండటం అతడు చూసాడు. అతడి అడుగులు అక్కడే ఆగిపోయాయి.

“రాత్రంతా అలాగే కూర్చుని ఉంటావా ఏమిటి?”

“ఏమో.”

“అంతకంటే పిచ్చిపని ఇంకొకటి ఉండదు.”

“నేను పిచ్చిదానినే అయితే?”

ఆమె పూర్తి ప్రశాంతతో పలికింది, అయితే ఆ ప్రశాంతతను సాధించటానికి ఆమె ఎంతో కష్టపడాల్సివస్తోంది: ఆమె గుండె వేగంగా కొట్టుకోవటం అతడికి వినిపిస్తోంది. యూరి పెట్రోవిచ్ మరొక అడుగు ముందుకువేసి, పాతబడిన హోటలు తివాచీమీద మోకరిల్లి, మెల్లగా ఆమె చేతులను తన చేతుల్లోకి తీసుకున్నాడు. ఎటువంటి ప్రతిఘటన లేకుండా ఆమె చేతులు అతడి చేతుల్లో ఇమిడిపోయాయి.

“నోనా...” ఆమె చేతులను ముద్దాడాడు. “ప్రియమైన, నోనా, నేను... “

“కొంచెం లైటు వేస్తావా?”

“లైటు ఎందుకు?”

“అయితే మాట్లాడకు.”

గుసగుసలుగా వస్తున్న మాటలు ఎదుటవాళ్లకు వినపడటం లేదు, వాటిని వాళ్లు అర్థం చేసుకున్నారంతే. వేగంగా కొట్టుకుంటున్న హృదయాల చప్పుళ్లే వాళ్లకు వినపడుతున్నాయి.

"నోనా, నీకొక విషయం చెప్పాలి –"

"మాట్లాడవద్దు. దయచేసి మాట్లాడవద్దు!"

అతడు ఆ సమయంలో ఏం చెప్పదలుచుకున్నాడు? తనని ప్రేమిస్తున్నాడనా? అది ఆమెకు అర్థం అవుతోంది. లేక తనని ప్రేమించటం లేదనా? కానీ, తన దగ్గర ఉండి, తనముందు మోకరిల్లి, తన చేతులను ముద్దుపెట్టుకుంటూ తనని ప్రేమించకుండా ఎట్లా ఉంటాడు?

నోనా ఆ విధంగా ఆలోచిస్తోంది. అవి ఆలోచనలు కూడా కావు – ఆ సమయంలో ఆమె దేనిగురించీ ఆలోచించే స్థితిలో లేదు. అది ఆమె మెదడులో మెరుపులా మెరిసింది. ఆమెలోని భయపడిన అమ్మాయి అదేమిటో తెలుసుకోటానికి, అర్థం చేసుకోటానికి ప్రయత్నిస్తుండగా, ఆమెలోని మహిళ అతడు కురిపిస్తున్న ముద్దుల వర్షం గురించే ఆలోచిస్తోంది.

ఆమె తన చేతులను మెల్లగా తనవైపు లాక్కోబోయింది. అతడు వాటిని విడిచిపెట్టకుండా తన ముఖాన్ని వాటిల్లో దాచుకున్నాడు.

"నోనా, నేను తప్పక చెప్పాలి –"

"వద్దు, వద్దు, వద్దు! నాకు అది వినాలని లేదు. నాకసలు ఏమీ వినాలని లేదు!"

"నోనా, నేను నీకంటే చాలా పెద్దవాడిని, నేను –"

"నన్ను ముద్దుపెట్టుకో."

తన గొంతు తనకే విస్మయం కలిగించింది. ఆమెలోపల అమ్మాయి ఇబ్బందిపడింది, తిరస్కరించింది, ప్రతిఘటించింది. కానీ యూరి పెట్రోవిచ్ ఇంకా మోకాళ్లమీదే ఉన్నాడు, ఎంతో దూరాన ఉన్నాడు, తనకి అందనంత దూరంగా. ఆమె మళ్లీ పలికింది, "వినపడిందా, నన్ను ముద్దుపెట్టుకో. ఇప్పటివరకూ నన్ను ఎవ్వరూ ముద్దుపెట్టుకోలేదు. ఎవ్వరూ."

అతడు మరొక్క క్షణం తటపటాయించి ఉంటే ఆమె కిటికీలోంచి కిందకి దూకేసి ఉండేది, లేక తన కాళ్లు తీసుకుపోయినచోటుకి పరిగెత్తి ఉండేది, లేక వాళ్లందరి మీద కసి తీర్చుకోటానికి అగ్గిపెట్టెలోని పుల్లలన్నీ తినేసి ఉండేది: జీవితంలో సంతోషం ఎరగని ఒక అమ్మాయి ఆ విధంగా ఆత్మహత్యకు పాల్పడిందని అమ్మ చెప్పింది. తన లోపల రహస్యంగా ఉన్న దిక్కుతోచని మహిళ ఆఖరి ప్రయత్నమది. తన ఒంటరితనాన్ని, రాత్రుళ్ల ఆవేదనను, కారణం లేని కన్నీటిని జయించటానికి చేసే ఆఖరి ప్రయత్నమది.

ఆ తరువాత...

ఆ తరువాత ఏం జరిగింది?

"నోనా, నేను నిన్ను ప్రేమిస్తున్నాను."

"ఇప్పుడు మాట్లాడు. నువ్వు చెప్పేదంతా వింటాను."

ఇద్దరూ పక్క, పక్కన పడుకుని ఉన్నారు, నోనా మాటిమాటికీ తనవైపు దుప్పటిని పైకి లాక్కుంటూ ఉంది.

కానీ ఇప్పుడు ఆమెలో ఎటువంటి వైరుధ్యమూ లేదు; ఆమెలోని సాహస మహిళ, పిరికి అమ్మాయి పూర్తి అవగాహనతో నవ్వుతూ సఖ్యతతో ఉన్నారు.

"నేను వెళ్లి ఒక సిగరెట్టు తెచ్చుకుంటాను, సరేనా?"

"తెచ్చుకో."

ఆమె కళ్లు మూసుకుని పడుకుని ఉంది. ఆమె పెదాలపై ఒక చిరునవ్వు కదలాడుతూ ఉంది. ఆమెను అనుమతి అడిగాడు, ఆమె అందుకు అంగీకరించవచ్చు, లేదా తిరస్కరించవచ్చు. ఈ అధికారంతో ఆమెకు కొద్దిగా తలతిరిగినట్టయ్యింది. ఆమె కనురెప్పలు కొద్దిగా తెరిచి చూసింది: ఒక తెల్లటి ఆకారం కుర్చీకి తగులుకుని, తిట్టుకుంటూ సోఫావైపుకి కదులుతోంది. అగ్గిపుల్ల గీచిన శబ్దం వినిపించి ముక్కుపుటాలకు పొగ వాసన సోకింది. "నా పక్కకి వచ్చి కాల్చుకో," అంది.

తెల్లటి ఆకారం తెర దగ్గర ఆగింది.

"నువ్వు నన్ను అసహ్యించుకోవాలి. నేను సిగ్గులేకుండా ప్రవర్తించాను. నేను నీకు చెప్ప..." యూరి పెట్రోవిచ్ ధైర్యం అంతలోనే నీరు కారిపోయింది. "లేదు, నాకు పెళ్లి కాలేదు... అంటే అధికారికంగా నాకు పెళ్లి అయ్యింది, కానీ... చూడు, ఆ విషయం మా అమ్మకు కూడా చెప్పలేదు. కానీ నీకు చెప్పటం నా బాధ్యత..."

"బాధ్యతా? నేనేమైనా పెళ్లి చేసుకోమని నిన్ను బలవంతపెడతాననుకున్నావా?" అదొక అపరిచిత వ్యక్తి గొంతు. ఆమెలో మహిళది కాదు, అమ్మాయిది కాదు. అది మూడవ గొంతు. దానిని గుర్తించినందుకు నోనా సంతోషించింది.

"ఆందోళన చెందకు: మనం ప్రగతిశీల మనుషులం."

అతడు ఏదో చెబుతున్నాడు. కానీ ఆమెకు దోషినన్న భావనతో కూడిన అతడి స్వరమే వినపడుతోంది, డొంకతిరుగుడుగా మాట్లాడుతూ తనని మంచి చేసుకోవాలన్న ప్రయత్నం కూడా అందులో కనపడుతోంది. ఆమెలో అతిశయంతో కూడిన క్రూరభావం ఏదో అప్పటికే తలెత్తుతోంది. ఆ గర్వానికి, ఆ క్రూరత్వానికి తలఒగ్గి ఆమె దుప్పటి తీసేసి, మెల్లగా బట్టలు వేసుకోసాగింది. ఒక పురుషుడి సమక్షంలో ఆమె మొదటిసారి బట్టలువేసుకుంటున్నప్పటికీ ఆమెకు సిగ్గుగా అనిపించలేదు: సిగ్గుపడుతున్నది అతడు, నోనా ఆ విషయం గుర్తించింది.

"మనం నిజంగా చాలా ప్రగతిశీల మనుషులం," ఆమె మళ్లీ అంది, సాధ్యమైనంతగా నవ్వుతూ. "వివాహం, రిజిస్ట్రేషను, విందులు – అవన్నీ పనికిమాలినవి! నిజంగా ఆలోచిస్తే అవంతా హాస్యాస్పదమైనవి! భూమి మీద ప్రతిదీ హాస్యాస్పదమైనదే! నాకై నేను ఇక్కడికి వచ్చాను, నా అంతట నేను వెళతాను. నేను విముక్త స్త్రీని."

ఆమెకు ఏం చెప్పాలో, ఎలా వివరించాలో, ఎలా వెళ్లకుండా ఆపాలో తెలియక అతడు మౌనంగా నిలబడి ఉన్నాడు. నోనా ప్రశాంతంగా బట్టలు వేసుకుంది, ప్రశాంతంగా తల దువ్వుకుంది.

"వద్దు, వద్దు, నన్ను పంపించటానికి రావద్దు. నువ్వు వివాహితుడివి, పైగా అధికారివి: హోటలు పనివాళ్లు ఏమనుకుంటారు! నీ గురించి ఏమిటేమిటో ఊహించేసుకుంటారు – వద్దు బాబూ!"

నోనా తెల్లవారుజాము రైలు తీసుకుని తిరుగు ప్రయాణమయ్యింది. ఒక మూలకు ముడుచుకుని కూర్చుంది, గుండ్రంగా ఫుట్‌బాల్ మాదిరి ఉన్న కొత్త గ్లోబుని హత్తుకుని ఉంది. ఏడవలేకపోతున్నందుకు జీవితంలో మొదటిసారి ఆమె విచారించింది.

ఇక్కడ యూరి పెట్రోవిచ్ పూర్తి గందరగోళంలో ఉన్నాడు. ఆ రోజంతా కదలకుండా పని చేస్తూ ఒక పెట్టె సిగరెట్లు కాల్చేశాడు. ఆ సాయంత్రం కూర్చుని ఆ మార్మిక మరీనాకి ఉత్తరం రాశాడు. అయితే దానిని డబ్బాలో వెయ్యకుండా మూడు రోజులపాటు జేబులో పెట్టుకుని తిరిగాడు. అప్పుడు దానిని మరొకసారి చదివి ముక్కలుముక్కలుగా చించేశాడు. మళ్లీ తన బల్ల దగ్గర చలనం లేకుండా కూర్చుండిపోసాగాడు. అతడి బల్ల కాగితాల గుట్టలతో నిండిపోసాగింది. తిరిగి ఉత్తరం రాయటంలో సగం రాత్రి గడిపాడు. ఈసారి, "ప్రియా, నన్ను మన్నించు!" అంటూ

మొదలుపెట్టాడు. అయితే ఉత్తరాలు రాయటంలో యూరి పెట్రోవిచ్‌కి నైపుణ్యం లేదు. దాంతో ఇంతకుముందు ఉత్తరాలకు పట్టిన గతే దీనికి కూడా పట్టింది.

హోటలు మంచంలో నిద్రపట్టక అటు ఇటు మసులుతూ, "నేనే అక్కడికి వెళ్లాలి," అని యూరి పెట్రోవిచ్ పలుమార్లు అనుకున్నాడు. "రేపు ఉదయం రైలుకి తప్పనిసరిగా వెళతాను."

కాని తెల్లవారటంతోనే అతడి నిర్ణయం నీరుగారిపోయేది. చువలోవ్ తనని తాను నిందించుకుని, దండించుకునేవాడు. కాదు, నోనా కారణంగా కాదు.

రెండు సంవత్సరాల క్రితం మాస్కో నుంచి ఒక విద్యార్థిని శిక్షణ నిమిత్తం మారుమూలనున్న అల్తాయి అటవీ సేవా కేంద్రానికి వచ్చింది. ఆపాటికి యూరి పెట్రోవిచ్‌కి విద్యార్థుల మాటలు అలవాటు తప్పాయి, పొట్టి గౌనులకు అలవాటు పడలేదు. దాంతో అతడు కుక్కపిల్లమాదిరి ఆమెను అనుసరించాడు. మొహమాటస్తుడైన అటవీ అధికారిని ఆమె ఏడిపించి ఆనందం పొందేది. శిక్షణ పొందుతున్నది ఆమె కాక తానేనని అప్పుడప్పుడు యూరి పెట్రోవిచ్‌కి అనిపిస్తూ ఉండేది. ఒక వారం తరువాత ఆ రోజు తన పుట్టినరోజని, షాంపేన్ తెచ్చిపెట్టమని ఆదేశాలు జారీ చేసింది. దానికోసం అటవీ సేవా కేంద్రం అధిపతి ప్రభుత్వ మోటరుసైకిల్ మీద రెండొందల కిలోమీటర్లకు పైగా ప్రయాణంచేశాడు. షాంపేన్ సీసా ఖాళీ చేసిన తరువాత ఆ విద్యార్థిని గదిలో అటూ, ఇటూ పచార్లు చేస్తూ, "పక్క సిద్ధం చెయ్యి. నేను గోడవైపుకి పడుకుంటాను," అంటూ ఆజ్ఞాపించింది.

తెల్లవారేసరికి యూరి పెట్రోవిచ్ బుర్ర పూర్తిగా పనిచెయ్యకుండాపోయింది.

"బట్టలు వేసుకో," అతడు అన్నాడు. "మనం గ్రామ సోవియట్‌కి వెళుతున్నాం."

నలిగిన దుప్పట్లమీద విద్యార్థిని హాయిగా కూర్చుని ఉంది.

"గ్రామ సోవియట్‌కా?"

"రిజిస్టరు చెయ్యటానికి," చొక్కా వేసుకుంటూ అతడు హడావిడిగా అన్నాడు.

"లేడికి లేచిందే పరుగన్నట్టు అలా వెళ్లిపోవటమేనా?" ఆమె పగలబడి నవ్వింది. "చాలా ఆసక్తికరంగా ఉంది!"

మోటరుసైకిల్ మీద రయ్యమంటూ గ్రామ సోవియట్‌కి వెళ్లారు. అక్కడ పది నిమిషాల్లో ధ్రువీకరణ పత్రం ఇచ్చారు, ఇద్దరి పాస్‌పోర్టుల మీద పెద్ద, పెద్ద ముద్రలు వేశారు. ఆ తరువాత మూడు రోజులకు నూతన వధువు మాస్కోకి వెళ్లిపోయింది. ఆ సమయంలో యూరి పెట్రోవిచ్

దూరంగా ఉన్న అటవీ ప్రాంతంలో పురుగులను నియంత్రించే పనిలో ఉన్నాడు. తిరిగి వచ్చేసరికి అతడికోసం ఒక కాగితం ఎదురు చూస్తూ ఉంది:

"ధన్యవాదాలు."

ఎటువంటి చిరునామా ఇవ్వకుండా ఆ విద్యార్థిని వెళ్లిపోయింది. దాంతో యూరి పెట్రోవిచ్ ఆమె కళాశాలకు రాశాడు. ఆ ఉత్తరం తన గమ్యం చేరుకోటానికి చాలా సమయం తీసుకుంది; రెండు నెలల తరువాత గానీ అతడికి సమాధానం రాలేదు, అది కూడా వాళ్ల వైవాహిక జీవితం మాదిరి చాలా క్లుప్తంగా ఉంది:

"నా పాస్‌పోర్టు పోయింది. నీకు కూడా అదే సలహా."

యూరి పెట్రోవిచ్ తన పాస్‌పోర్టు పోగొట్టుకోటానికి ప్రయత్నించలేదు. అయితే ఆ మొత్తం వృత్తాంతాన్ని మరిచిపోటానికి ప్రయత్నించాడు, ఆపై అతడు ఉత్తరాలు ఏమీ రాయలేదు. ఆ తరువాత ఏదో పనిమీద లెనిన్‌గ్రాడ్ వెళ్లవలసి వచ్చింది. అక్కడ తన పాఠశాల మిత్రుడి ద్వారా ఒక కొత్త విషయం తెలియటంతో పాస్‌పోర్టు పోయిన తన భార్య కోసం మళ్లీ వెదకటానికి పూనుకున్నాడు:

"నీకు తెలుసా, మరీనా బిడ్డను కన్నది."

ఆమె వివరాలు అతడు సాధించాడు. ఆమె ఇంటి చిరునామాకి ఉత్తరం రాశాడు. పుట్టిన బిడ్డకి తండ్రి తనేనా అన్న ప్రశ్నకి సమాధానానికి రెండే రెండు పదాలతో సమాధానం వచ్చింది:

"ఏదైనా కావచ్చు."

నిజం తెలుసుకోవలసిన అవసరం ఇప్పుడు అతడికి ఎంతైనా ఉంది. అతడు ఏమిటో తెలుసుకోవాలి: భర్తో, కాదో; తండ్రో, కాదో; స్వేచ్ఛాపరుడో, కాదో. కానీ ఆమె సమాధానంలోని వ్యంగ్యం కారణంగా అతడికి ఏం చెయ్యాలో తెలియటం లేదు. దాంతో అతడు ఉత్తరాలు రాస్తున్నాడు, చించేస్తున్నాడు, మళ్లీ రాస్తున్నాడు.

ఇప్పుడు నోనాని పోగొట్టుకుంటానేమోనని అతడు భయపడుతున్నాడు. జీవితాంతం గడపదగ్గ తోడు ఈమె. అందుకే యూరి పెట్రోవిచ్ రైలు ఎక్కి ఆమె దగ్గరకు వెళ్లటానికి ధైర్యాన్ని కూడగట్టుకోలేకపోయాడు. వెళ్లడమంటే అవునో, కాదో తేల్చుకోవటం – "ఏమో" అన్న అనిశ్చితి అతడికి ప్రస్తుతం కొంత ఊరటనిచ్చేదిగా ఉంది. సరిగ్గా అదే సమయంలో మాస్కోనుంచి ఒక

ముఖ్యమైన అధికారి వచ్చాడు. దాంతో ఎక్కడికీ వెళ్లటానికి లేనందుకు యూరి పెట్రోవిచ్ కొంత తెరిపిన పడ్డాడు. మూడు రోజులపాటు అధికారికి అన్ని విషయాలు అవగతం అయ్యేలా వివరించాడు. అయితే ఉన్నట్టుండి ఆమెను చూడాలన్న కోరిక తీవ్రం కావటంతో, "మీకు ఆసక్తి కలిగించేవి ఇక్కడ చుట్టుపక్కల్లో లేవు: ఇవన్నీ మనుషులు పెంచిన అడవులు. అయితే నల్లచెరువు దగ్గర సహజ అడవి ఇంకా కొంచెం మిగిలి ఉంది. మనం అక్కడికి వెళదాం," అని అతడు ప్రకటించాడు.

ఆ మాట అన్న మరుక్షణం అతడు భయవిహ్వాలుడయ్యాడు: అధికారి అందుకు ఒప్పుకుంటే?

"దోమలకు ఆహారం కావటానికా?"

"ఇప్పుడక్కడ నుసుములు తప్పించి దోమలు లేవు." అధికారిని ఒప్పించటానికి తాను ప్రయత్నించటం యూరి పెట్రోవిచ్‌కి ఆశ్చర్యం కలిగిస్తోంది. "జీవుల సహజీవనాన్ని అధ్యయనం చెయ్యటానికి అది ఎంతో అనువైన ప్రాంతం: అది మీకు ఎంతో ఆసక్తి ఉన్న విషయం కదా."

"సరే, నేను మనసు మార్చుకునేలా చేసావు," అని అధికారి అనటంతో యూరి పెట్రోవిచ్ విస్మయానికి గురయ్యాడు.

ఆ ఊరికి చేరుకున్న తరువాత పై అధికారిని స్థానిక అధికారులకు పరిచయం చేసి నోనా ఇంటికి పరిగెత్తాడు చువలోవ్. తన ప్రేమను వెల్లడించటానికి ఏమేమి చెప్పాలో అతడు అనేకమార్లు వల్లె వేసుకున్నాడు. అయితే ఆమె ఇంటి తలుపుకి పెద్ద తాళం వేలాడుతుండటం చూసి మొదట తన కళ్లను తానే నమ్మలేకపోయాడు. దానిని పట్టుకుని చూశాడు, ఇంటి చుట్టు తిరిగాడు, ఆ తరువాత పాఠశాల ప్రిన్సిపాల్ ఇంటికి వెళ్లాడు.

"నోనా యురీవ్నా లెనిన్‌గ్రాడ్‌లో ఉంది. మూడు రోజుల క్రితం వెళ్లింది."

"ఎప్పుడు తిరిగి వస్తోంది?"

"ఆగస్టు ఇరవైన రావాలి, కానీ..." ప్రిన్సిపాల్ నిట్టూర్చాడు. "కాని పోయిన సంవత్సరం కూడా మాకు ఇటువంటి అనుభవమే ఎదురయ్యింది."

"ఏమిటంటున్నారు?"

“నోనా కంటే ముందు పనిచేసిన టీచరు కూడా వాళ్ల అమ్మను చూడటానికి వెళ్లింది, ఆ తరువాత తన రాజీనామా పత్రాన్ని పంపించింది.”

“అలా ఎలా చేస్తారు!”

“ఏదైనా చెయ్యవచ్చు,” వేదాంత ధోరణిలో ప్రిన్సిపాల్ అన్నాడు. “అయితే, నోనా యురీవ్నా ఆసక్తిగల టీచరు, అయితే లెనిన్‌గ్రాడ్ కూడా ఆసక్తిగొలిపే నగరం కదా.”

“అవునవును,” మెల్లగా అన్నాడు యూరి పెట్రోవిచ్. “ఆమె తల్లి చిరునామా మీ దగ్గర ఉందా?”

ఆ చిరునామా రాసుకుని పాఠశాలకు కట్టెపుల్లలు ఇస్తానని పరధ్యాసగా చెప్పాడు. ఇప్పుడు చాలా అనాసక్తితో ముఖ్యమైన అధికారిని రిజర్వు అడవిలోకి తీసుకెళ్లాడు.

అడవిలో నడకని ఒకవైపు ఆస్వాదిస్తూనే, “నన్ను ఇక్కడికి లాకొచ్చావు,” అని అధికారి గొణుగుతున్నాడు. “అంతే కాకుండా బండి గురువింద కొమ్మలతో పక్క ఏర్పాటు చేస్తావేమో. నువ్వు ఒంటరి తోడేలువి, చువలోవ్ – నువ్వు ఇంకా బ్రహ్మచారిగానే ఉండటం ఆశ్చర్యం కలిగించదు.”

“ఇక చాలించండి!” యూరి పెట్రోవిచ్ కొంచెం చిరాకుగా అన్నాడు.

ఒక నిముషం మౌనంగా ఉన్న తరువాత, “నువ్వు మతగురువుగా మారటానికి తరుణమిదే,” అన్నాడు అధికారి. “అది సరేగాని. నీ పరిధిలోని అడవిని చక్కగా నిర్వహిస్తున్నావని తనిఖీ అధికారిగా చెపుతున్నాను. అడవి శుభ్రంగా ఉంది. ఎక్కడా కొట్టిన చెట్లు కనపడటం లేదు. యూరి, ఇదంతా నాకు నచ్చింది.”

ధుమధుమలాడుతూనే ఉన్న యూరి పెట్రోవిచ్ దానికి బదులివ్వలేదు. చెక్క పలకలతో చేసిన పెద్ద బోర్డు దగ్గరకు రావటంతో అధికారి కూడా మౌనంగా మారిపోయాడు. కాల్చిన మేకుతో చెక్కమీద ఈ కింది కవిత రాసి (కాల్చి) ఉంది:

పర్యాటకులారా, జాగ్రత్త!

అడవిలో కావాలి అప్రమత్తత,

నిప్పుతో వద్దు ఆట,

దానితో మన ఇంటికే తంటా.

అడవిలో చేద్దాం విహారం –

ఇదే మనకు ఆధారం.

ఆ కవితకు రెండువైపులా కుందేళ్లు, ముళ్లపందులు, ఉడతలు, అలసిపోయిన యకోవ్ ప్రొకొపిచ్ లాగా ఉన్న ఒక పెద్ద జింక గీసి (కాల్చి) ఉన్నాయి.

"బాగుంది," అన్నాడు అధికారి. "నీ చొరవా?"

"కాదు!" అన్నాడు యూరి పెట్రోవిచ్. "ఇదంతా చెయ్యటానికి అతడికి సమయం ఎప్పుడు దొరికిందో!"

"ఎవరికి?"

"ఇక్కడి అటవీ అధికారి. యెగార్ పొలుష్కిన్."

"ఆసక్తికరంగా ఉంది," అన్నాడు అధికారి. "ఒక ఫొటో తీసుకుంటాను," అంటూ తన కెమేరా బయటకు తీసాడు.

"కెమేరా రీళ్లు సరిపోవు," అన్నాడు చువలోవ్.

సాయంత్రానికి యెగార్ తాత్కాలిక నివాసానికి చేరుకున్నారు. దారిలో అధికారి కోల్కా కవితలన్నింటిని రాసుకున్నాడు, ఒక రీలు మొత్తం ఉపయోగించేసాడు.

"నువ్వేనా రచయితవి?" అతడు కోల్కాని అడిగాడు. "బాగున్నాయి! కవివి అవుతావా?"

"లేదు," సిగ్గుపడుతూ అన్నాడు కోల్కా. "అటవీ వార్డెనునవుతాను. యూరి పెట్రోవిచ్ లాగా."

"మంచి లక్ష్యమే ఎంచుకున్నావు, కోల్కా!"

యెగార్ ఆపాటికే అలసిపోయి ఉన్నాడు. అంత పెద్ద అధికారి చూపిస్తున్న ఆసక్తి అతడికి కొంత ఇబ్బందికరంగా అనిపించటంతో అతడు మంటనుంచి కొంచెం దూరంగా వెళ్లి కూర్చున్నాడు.

చువలోవ్ విచారంగా ఉన్నాడు. కానీ యెగార్ ఆ విషయం గమనించనే లేదు. అతడి ఆలోచనల నిండా పెద్ద అధికారే ఉన్నాడు, ఎక్కడా ఏ పొరపాటు చెయ్యలేదుకదా అని ఆలోచిస్తున్నాడు.

“ఎప్పుడైనా మాస్కోకి వెళ్లావా, యెగార్ సవెలిచ్?”

“మాస్కో?” ఒక్కసారిగా సంభాషణ మారటంతో యెగార్ అయోమయానికి లోనయ్యాడు. “అక్కడ ఏముంది?”

దాంతో యూరి పెట్రోవిచ్ తన వైవాహిక జీవిత విషాద గాథనంతా యెగార్‌కి చెప్పాడు. యెగార్ అది విని ఆందోళనకు లోనయ్యాడు. మధ్య, మధ్యలో మాస్కో ప్రస్తావన కూడా వస్తుండటంతో అతడు గందరగోళానికి గురయ్యాడు. అందుకే, “అయితే, ఆమె మాస్కోలో ఉందంటావు?” అని మళ్లీ అడిగాడు.

“ఓయ్ కుట్రదారులు, సూప్ సిద్ధంగా ఉంది!” అంటూ అధికారి కేకపెట్టాడు.

ఒక వారం రోజుల తరువాత యెగార్‌కి మాస్కోనుంచి ఒక అధికారిక ఆహ్వానం వచ్చింది. అటవీ అధికారి యెగార్ పొలుష్కిన్‌ని అటవీ సేవా కార్మికుల అఖిల సమాఖ్య సమావేశానికి రమ్మని పంపించిన ఆహ్వానం అది. అతడు ఈ ఉద్యోగంలో చేరి ఎక్కువ కాలం కాకపోయినప్పటికీ అతడి అసాధారణ కృషికిగాను ఆ ఆహ్వానం పంపినట్టు ఉంది. “నేను ఏనుగును చూసి వస్తాను, కొడుకా,” అన్నాడు యెగార్.

“ఏనుగును చూసి ప్రయోజనం లేదు,” హారిటీనా గొణిగింది. “దానికి బదులుగా గమ్ (జియుఎం)[1]కి వెళ్లు: ఇక్కడివాళ్లు తమకు కావలసిన సరుకుల జాబితా ఇచ్చి, డబ్బులు ఇచ్చారు.” యెగార్‌కి వీడ్కోలు చెప్పటానికి యకోవ్ ప్రొకొపిచ్ తప్పించి ఎవరూ రాలేదు. అతడు ఒక విన్నపంతో వచ్చాడు. “నువ్వు ఒక సహాయం చెయ్యాల్సి ఉంటుంది – నువ్వు సభలో మాట్లాడేటప్పుడు అద్దెకు పడవలు ఇచ్చే కేంద్రం గురించి ప్రస్తావించటం మరిచిపోవద్దు, పొలుష్కిన్. అందరినీ మర్యాదగా ఆహ్వానించు: ఇక్కడ ఉన్నవి నీకు తెలుసుగా. పెద్ద చెరువు, అడవిలో పుట్టకొక్కులు మొదలైనవాటి గురించి చెప్పు. రాజధాని నుంచి ఇక్కడకి రావటానికి ఆసక్తి కనబరిచే వాళ్లు ఉండవచ్చు.” యెగార్ ఇంటినుంచి బయలుదేరబోతుండగా నవ్వు ముఖంతో మారిట్సా వచ్చింది. “ఓ టీనా, ఓ యెగార్ సవెలిచ్! నువ్వు వెళుతున్నది జిల్లా కేంద్రానికి కాదు, మాస్కోకన్నమాటు.” “అవును,” అన్నాడు యకోవ్ ప్రొకొపిచ్. అయితే మారిట్సాకి ఇప్పుడు యకోవ్ ప్రొకొపిచ్‌తో పనిలేదు. ఏమీ చేతగాని అసమర్థుడన్న పేరుబడిన యెగార్ పొలుష్కిన్‌తో పని ఉంది. ఆమె తన జాలిగొలిపే చూపులను అతడిమీద నుంచి మరల్చలేదు. “యెగార్ సవెలిచ్, నేను నీ

దగ్గరకి రహస్యంగా వచ్చాను. ఈ విషయం నా భర్తకి, కొడుకుకి తెలియదు. దేవుని మీద ప్రేమతో మమ్మల్ని కాపాడు. ఫ్యొడార్ ఇపటొవిచ్ మీద నేర పరిశోధన చేపట్టారు. మమ్మల్ని కటకటకాలపాలు చేస్తామంటున్నారు.” “చట్టాన్ని గౌరవించాల్సి ఉంటుంది,” కఠినంగా అన్నాడు యకోవ్ ప్రొకొపిచ్. యెగార్ ఏమీ మాట్లాడలేదు. మారిట్సా చెల్లెలి భుజంమీద తలపెట్టుకుని ఏడవసాగింది. “మా పని అయిపోయింది!” “అక్కడ ఎవరైనా అధికారికి చెప్పు, యెగార్?” హారిటీనా నిట్టూర్చింది. “ఎంతైనా వాళ్లు మన బంధువులే కాని అపరిచితులు కాదు కదా.” “నన్నెవరు అడుగుతారు?” భృకుటి ముడివేస్తూ అన్నాడు యెగార్. “మామూలు అటవీ అధికారి మాస్కోకి వస్తే అదేమైనా పెద్ద విషయమా.” మారిట్సా ఎంతగా ఏడ్చి, బతిమాలినా అతడు అంతకంటే ఏమీ చెప్పలేదు. మాస్కో కోసమని ప్రత్యేకంగా కొన్న పెద్ద సూట్‌కేసు తీసుకుని ప్రయాణానికి సిద్ధమయ్యాడు. అందరికి వీడ్కోలు చెప్పాడు. ఒక్క క్షణం కూర్చుని స్టేషనుకి బయలుదేరాడు. మారిట్సా ఇంటికి పరిగెత్తింది. “ఏమన్నా పని అయ్యిందా?” అడిగాడు ఫ్యొడార్ ఇపటొవిచ్. “సహాయం చెయ్యటానికి అతడు నిరాకరించాడు, ఫ్యొడార్. అతడికి గర్వం తలకెక్కింది.” “గర్వమా?” అతడి దవడలోని ప్రతి కండరం బిగుసుకుంది. “అతడికి గర్వమెక్కితే సరే. అదీ చూద్దాం.” ఆ సమయంలో యెగార్ రైలులో కిటికీ పక్కన కూర్చుని ఉన్నాడు. ఆ రైలు చక్రాల మోత మాస్కో! మాస్కో! మాస్కో!.. అంటూ వినపడుతోంది. అతడు మాస్కోకి వెళ్లే రైలులో లేడన్నది వేరే విషయం. ముందు జిల్లా కేంద్రానికి వెళ్లి అక్కడ రైలు మారాల్సి ఉంది. అదే సమయంలో అదే స్టేషనులో మరొక రైలు బయలుదేరింది: దాంట్లో యూరి పెట్రోవిచ్ కిటికీ పక్కన కూర్చుని ఉన్నాడు. ఈ రైలు చక్రాల శబ్దం మరొక రకంగా ఉంది: లెనిన్‌గ్రాడ్! లెనిన్‌గ్రాడ్! లెనిన్‌గ్రాడ్!..

---

1. జియుఎం – మాస్కోలో అతి పెద్ద మాల్ (దుకాణం). – అనువాదకుడు.

*(తరువాయి భాగం వచ్చే వారం)*

For Latest Telugu Books - Visit now:
Kinige
.com